ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
శనివారం 5 అక్టోబరు 2024

21 మంది ఎంపీడీవోల బదిలీ

- ఇతర జిల్లాల నుంచి ఏడుగురు కేటాయింపు
- ఇన్‌చార్జ్ ఎంపీడీవోలుగా మరో ఏడుగురి నియామకం
- మొత్తం 35 మండలాలకు నూతన ఎంపీడీవోలు

కడప (రూరల్), అక్టోబర్ 4: ఉమ్మడి కడప జిల్లాలోని 21 మంది ఎంపీడీవోలను జడ్పీశాఖ బదిలీ చేసింది. వీరితో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఏడుగురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇవ్వగా మరో ఏడుగురు ఏవోలను ఇన్‌చార్జ్ ఎంపీడీవోలుగా నియమించారు. ఇలా ఉమ్మడి కడప జిల్లాలోని మొత్తం 35 మండలాలకు ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఆయా మండలాలకు కేటాయించిన ఎంపీడీవోలకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. వీరంతా శుక్రవారం జడ్పీ కార్యాలయానికి వచ్చి ఆర్డర్స్ తీసుకుని ఆదే రోజు వారు బదిలీ అయిన మండలాలకు చేరుకుని ఎంపీడీవోలుగా బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు 13 మంది ఈవోపీఆర్డీలు బాధ్యతలు చేపట్టారు.

35 మంది ఎంపీడీవోల వివరాలు

పేరు	ప్రస్తుతం	బదిలీ
సి.వెంకటరామయ్య	పెద్దముడియం	ఎర్రగుంట్ల
జె.సుజాతమ్మ	అట్లూరు	నందలూరు
జి.రెడ్డెయ్య	ఒంటిమిట్ట	లక్కిరెడ్డిపల్లె
సి.వెంకటేశ్	పులివెందుల	రాయచోటి
కె.కుల్లాయమ్మ	ప్రొద్దుటూరు	వేంపల్లె
ఏవీ రమణారెడ్డి	వీఎన్‌పల్లె	రాజుపాళెం
సి.రామక్రిష్ణయ్య	గోపవరం	దువ్వూరు
కేవీ శ్రీధర్‌నాయుడు	చాపాడు	మైదుకూరు
సీఏ జవహర్‌బాబు	సిద్దవటం	గాలివీడు
ఎస్.దివిజ	వేంపల్లె	ఖాజీపేట
వి.జయశ్రీ	వల్లూరు	పుల్లంపేట
ఎస్.షంసద్‌భాను	మైలవరం	పెద్దముడియం
ఎస్.విజయరావు	ఓబులవారిపల్లె	పెనగలూరు
పి.వర్‌ప్రసాద్	పెనగలూరు	రాజంపేట
ఎ.మల్‌రెడ్డి	రాయచోటి	ఓబులవారిపల్లె
ఎన్.రామచంద్ర	టి.సుండుపల్లె	సంబేపల్లె
జీవీ రఘురామ్	పుల్లంపేట	వల్లూరు
ఎస్.ఫణిరాజకుమారి	రాజంపేట	సిద్దవటం
ఎస్.శ్రీనివాసరెడ్డి	గాలివీడు	లింగాల
ఎస్.సూర్యనారాయణరెడ్డి	రామాపురం	ప్రొద్దుటూరుకు
జె.జాషువా	కోడూరు	రామాపురం

ఇతర జిల్లాల నుంచి..

బి.కిరణ్‌మోహన్‌రావు	అనంతపురం	చెన్నూరు
సయ్యద్ ఉస్నీషా	కర్నూలు	జమ్మలమడుగు
ఏ.వీరకిశోర్	ఈస్ట్‌గోదావరి	చాపాడు
పీఎం కుళాయిబాబు	చిత్తూరు	చింతకొమ్మదిన్నె
ఎస్.సుధాకర్‌రెడ్డి	చిత్తూరు	టి.సుండుపల్లె
బి.రాజశేఖర్‌రెడ్డి	చిత్తూరు	చక్రాయపేట
ఎం.రమణారెడ్డి	చిత్తూరు	గోపవరం

ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా ఏవోలు..

జి.చంద్రమౌళీశ్వర్	వీఎన్‌పల్లె	వీఎన్‌పల్లె
కె.సురేంద్రనాథ్	పెండ్లిమర్రి	పులివెందుల
వై.రామచంద్రారెడ్డి	మైలవరం	మైలవరం
బి.సోమశేఖర్	ఒంటిమిట్ట	ఒంటిమిట్ట
యు.భాస్కర్‌బాబు	అట్లూరు	అట్లూరు
ఆర్.రమణారెడ్డి	పీఆర్‌అండ్‌ఆర్డీ	పోరుమామిళ్ల
సీహెచ్ నారాయణరావు	పుల్లంపేట	రైల్వేకోడూరు

వైసీపీకి ఎర్రగుంట్ల చైర్మన్ గుడ్‌బై

- పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ అధిష్టానికి లేఖ



హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల, అక్టోబరు 4: ఎర్రగుంట్ల నగర పంచాయతీ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆ యన శుక్రవారం పార్టీ అధిష్టానికి లేఖను పంపారు. 18 మార్చి 2021న ఆయన ఎర్రగుంట్ల నగరపంచాయతీ చైర్మన్‌గా వైసీపీ తరుపున ప్రమాణస్వీకారం చేశారు. ఇక్కడ 16వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఈ యన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మాజీ హోం మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి కుమారుడైన హర్షవర్ధన్‌రెడ్డి జమ్మలమడు గు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డికి సోదరుడు. మొత్తం 20మంది కౌన్సిలర్లున్న ఎర్రగుంట్ల నగరపంచాయతీలో అందరూ వైసీపీ తరుపున ఎంపికయ్యారు. ఎర్రగుంట్ల నగరపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి రెండుసార్లు ఎన్నికలు జరిగాయి. రెండుసార్లు వైసీపీనే గెలుచుకుంది. మొదటగా ఎంపికైన హెచ్. ముసలయ్య కూడా పార్టీ మారారు. నేడు హర్షవర్ధన్‌రెడ్డి కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పారు. అయితే ప్రస్తుతానికి తాను తటస్థంగా ఉంటానని చెబుతున్నా.. ఆయన బీజేపీలో చేరుతారని సమాచారం. ఈయనతోపాటు కొందరు కౌన్సిలర్లు కూడా బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎర్రగుంట్లలో వైసీపీకి భారీ గండి పడనుంది.

జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చండి

- సీఎంకు మంత్రి సత్యకుమార్ లేఖ

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4: జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా గజిట్‌లో మార్పు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడుకు ఆయన లేఖ రాశారు. కడప జిల్లాలో ప్రస్థి పుణ్యక్షేత్రం దేవునికడప అన్నారు. దేవుని కడప పేరుతోనే కడప జిల్లా అనే పేరు వచ్చిందన్నారు. ఇంతటి గొప్ప చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉన్న కడప పేరును గత ప్రభుత్వం అవగాహనరాహిత్యంతో వైఎస్సార్ జిల్లాగా మార్చిందన్నారు. దీంతో శ్రీవారి భక్తుల మనసులు నొచ్చుకున్నా భయంతో ఎవరూ తమ అభిప్రాయాలు బయటపెట్టలేదన్నారు. తాను గతంలో శాసనసభలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. వైఎస్ రాజశఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో కడప జిల్లా అభివృద్ధికి కృషి చేశారన్నది ఎవరూ కాదనలేని సత్యమని చెప్పారు. కావున కడప చారిత్రక నేపథ్యాన్ని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న కాలంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ కడపజిల్లాగా మార్చాలని ఆ లేఖలో కోరారు.

ముద్దనూరు - పుట్టపర్తి మధ్య రైల్వేమార్గం

- సర్వే జరుగుతోందన్న రైల్వే శాఖ



పులివెందుల, అక్టోబరు 4: ముద్దనూరు పుట్టపర్తి మధ్య కొత్త రైల్వే మార్గం ఏర్పాటు కోసం సర్వే జరుగుతోందని రైల్వే శాఖ తెలిపింది. ఇటీవల కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి జిల్లాలోని పలు రైల్వే సమస్యలను దక్షిణమధ్య రైల్వే జీఎంకు వివరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడలో ఎంపీలతో జరిగిన సమావేశంలో రైల్వే శాఖ రాతపూర్వక లేఖ ఇచ్చింది. అందులో తెలిపిన మేరకు.. త్వరలో ప్రవేశపెట్టబోయే వందే భారత్ స్లీపర్ రైలును తిరుపతి నుంచి సికింద్రాబాద్ వరకు కడప మార్గంలో ఏర్పాటు చేసే విషయం రైల్వే బోర్డు నిర్ణయిస్తుందన్నారు. కడప రైల్వే స్టేషన్‌లో వృద్ధులకోసం లిఫ్ట్ సౌకర్యం ఉందని, కొన్ని చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నాయన్నారు. కొన్నిచోట్ల ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. విజయవాడ-గుంటూరు నంద్యాల-యర్రగుంట్ల-కడపమీదుగా తిరుమల ఎక్స్‌ప్రెస్ మళ్లింపుకోసం రైల్వే బోర్డు ప్రతిపాదించిందన్నారు. నంద్యాల మరియు బెంగళూరు మధ్య గుత్తి మీదుగా ఎక్స్‌ప్రెస్ రైలు మరియు రెండు నాన్‌డైలీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయన్నారు. కొత్త రైలు ప్రవేశపెట్టడం రైల్వేబోర్డు పరిధిలో ఉంటుందన్నారు. అమృత్ పథకం కింద కడప స్టేషన్ ఉన్నందున మూడు పనులు పూర్తయ్యాయని, మరో ఆరు పనులు పూర్తికావాల్సి ఉందన్నారు. ఇంకా జిల్లాలోని అనేక సమస్యలను తెలియజేయగా వాటికి రైల్వే శాఖ సమాధానమిచ్చింది.

ఏటీయం దొంగల సవాల్..!



ఒంటిమిట్టలోని ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగుడు (ఫైల్)

- దండయాత్ర తరహాలో వరుస చోరీలు..
- ఎస్బీఐ ఏటీయంలే టార్గెట్
- సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ
- దొంగల ముఠా కోసం 8 బృందాలు వెదుకులాట



(కడప-ఆంధ్రజ్యోతి): అది ఉత్తరాదికి చెందిన దొంగల ముఠా. బాహుబలి సినిమాలో కాలకేయులు ముట్టడించినట్లుగా ఒక్కసారిగా వాహనాల్లో వచ్చి తెల్లారేలోపు కోట్లాది రూపాయలు కొట్టేస్తోంది. రాకెట్ కన్నా స్పీడ్‌గా చోరీ చేసిన వెంటనే రాష్ట్రం దాటిపోవడం ఆ ముఠా ప్రత్యేకత. ఎక్కడో ఉత్తరాదిలో ఉంటూ దక్షిణాది రాష్ట్రాల్లో వరుసగా ఏటీయంలు కొల్లగొడుతున్న ఆ ముఠా ఇప్పుడు మన పోలీసులకే కాదు సౌత్ పోలీసులకే చాలెంజ్‌గా మారింది. ముఖ్యంగా ఎస్బీఐ ఏటీయంలనే వీరు టార్గెట్ చేశారు. ఇటీవల జిల్లాలో చోరీకి గురైన మూడు ఏటీయంలు ఎస్బీఐవే కావడం గమనార్హం. గత నెల 22న కడప, ఒంటిమిట్టలోని ఎస్బీఐ ఏటీయంలలో దొంగతనం చేశారు. కడపలోని ద్వారకానగర్‌లో ఎస్బీఐ ఏటీయంలో రూ.6,19,700 నగదు దోచేయగా, విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో ఉన్న ఏటీయంలో దొంగనతానికి ప్రయత్నించి అలారం మోగడంతో వెనక్కి తగ్గారు. ఇక ఒంటిమిట్ట ఎస్బీఐకి వెళ్లి రూ.36,19,400 కొట్టేసి వెళ్లారు. ఈ దోపిడీలు జిల్లాలో సంచలనం రేకెత్తించాయి. ఇక ఈ ముఠా ఆచూకీ కోసం ఎస్పీ హర్షవర్ధన్ రాజు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లో గాలిస్తున్నారు.

ఎస్బీఐ ఏటీయంలే లక్ష్యం

హర్యానాలోని న్యూజిల్లా, రాజస్థాన్ ఏరియాలకు చెందిన కరుడుగట్టిన దొంగల ముఠా ఎస్బీఐ ఏటీయంలను కొల్లగొడుతోంది. ముఖ్యంగా మన జిల్లాలో సొంతిళ్లలో తాళాలు తీసినట్లుగా ఎంచక్కా ఎస్బీఐ ఏటీఎంలు కొల్లగొడుతున్నారు. జిల్లాలో హెచ్‌డీఎఫ్‌సీ, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకుతో పాటు మరికొన్ని బ్యాంకుల ఏటీయంలు ఉన్నాయి. ఇందులో ఎస్బీఐకే 187 ఏటీయంలు ఉన్నాయి. మిగతా బ్యాంకులతో పోలిస్తే ఎస్బీఐ ఏటీయంలలో సెక్యూరిటీ ఉండదు. ఇదే దొంగల ముఠాకు కలిసి వచ్చినట్లుంది. అక్కడ ఉన్న ఏటీయంలు సరైన గేజ్‌లో లేకపోవడం, తక్కువ ఎత్తులోనే సీసీకెమెరాలు ఉండడంతో సెక్యూరిటీ పరంగా వీక్‌గా ఉంటున్నాయంటున్నారు. ఇక్కడ సెక్యూరిటీ వీక్‌గా ఉండడంతో దొంగల ముఠా మాస్కులు, గ్లౌజులు ధరించి ఏటీయంలోకి వెళ్లడం, సీసీ కెమెరాపై స్ప్రే చేయడం, గ్యాస్‌కట్టర్‌తో కత్తిరించి అందులోని డబ్బులు దోచేయడం ఈజీగా మారింది. ఏటీయం మంచి గేజ్‌లో ఉండి, వాటిని గ్యాస్‌కటర్‌తో టచ్‌చేస్తే అలారం మోగడం, ఏటీయం బయటి భాగంలో కూడా అందనంత ఎత్తులో క్వాలిటీ గల సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగతనాలు జరిగే ఆస్కారం ఉండదని నిపుణులు అంటున్నారు. మిగతా బ్యాంకుల ఏటీయంలలో క్వాలిటీతో పాటు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఉంటాయి. దీంతో దొంగల ముఠా అక్కడికి పోవడంలేదు.

ఎస్బీఐ భద్రత చర్యలు నామమాత్రం

ఎస్బీఐ ఏటీఎంల వద్ద సెక్యూరిటీ ఉండదు. అందుకే వీటిని టార్గెట్ చేస్తున్నారు. ఎస్బీఐలో డబ్బులు శుక్రవారం పెడితే శని, ఆదివారాల్లో చోరీ జరుగుతుండడం గమనార్హం. చోరీ జరిగినా ఇన్సూరెన్స్ క్లెయిమ్ అవుతుండడంతో ఎస్బీఐ అధికారులు సెక్యూరిటీ పట్ల లైట్ తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. కనీసం ఏటీయంలో డబ్బులు పెట్టాక నాలుగురోజులైనా సెక్యూరిటీని పెడితే దొంగతనాలను అరికట్టవచ్చని అంటున్నారు. అప్పు చెల్లించడంలో ఆలస్యమైనా వినియోగదారులపై రకరకాల చార్జీలు చేస్తున్న బ్యాంకులు మరి వారి ఏటీఎంల పటిష్టతకోసం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అదో దండయాత్ర

మహ్మద్‌ఘోరీ దండయాత్ర చేసినట్లుగా ఉత్తరాదికి చెందిన దొంగలు ఏటీయంలను దోచుకునేందుకు దక్షిణాదిలో దండయాత్ర చేయడం ఇప్పుడు పోలీసులకు సవాల్‌గా మారింది. వాళ్లంతా బాగా నిష్ణాతులైన దొంగలు. ఎలాగంటే పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు చోరీ చేసిన రోజు తెల్లారేలోపే రాష్ట్రం దాటి పోవడం వారి ప్రత్యేకత. కడపలో గత నెల 22వ తేదీ అర్ధరాత్రి 12.46కు ఆర్టీసీ బస్టాండు నుంచి రైల్వేస్టేషన్ వెళ్లేదారిలో విశ్వేశ్వరయ్య జంక్షన్ వద్ద ఏటీయంలోకి దొంగలు ప్రవేశించారు. అక్కడ దొంగతనానికి ప్రయత్నించగా సైరన్ మోగడంతో వెనక్కి వచ్చారు. అనంతరం రైతు బజారు ప్రాంతంలో ఉన్న ద్వారకానగర్‌లోని ఏటీయంలోకి తెల్లవారుజామున 2 నుంచి 3గంటల మధ్య వెళ్లి గ్యాస్‌కట్టరుతో కట్ చేసి రూ.6 లక్షలకు పైగా కొట్టేశారు. తరువాత ఒంటిమిట్టలో ఉన్న ఎస్‌బీఐ ఏటీయంకు వెళ్లి రూ.36,19,400లు కొట్టేశారు. తెల్లారే సరికి వీరు తమిళనాడు వెళ్లిపోయారు. అంతకుముందు రోజు రాత్రే తెలంగాణలోని వెబ్బేరులో ఏటీయం లూటీ చేసిన ఈ ముఠా తెల్లవారేలోపు మన రాష్ట్రంలోకి ప్రవేశించింది. ఇక్కడ చోరీ తరువాత మరుసటి రోజే తమిళనాడులో ఏటీయం కొల్లగొట్టడం గమనార్హం.



కడపలో ఏటీయం దొంగతనాలు (ఫైల్)

జిల్లాలో వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థ గాడి తప్పింది. దీనిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఇప్పుడిప్పుడే గాడిన పెడుతున్నారు. కేసుల నమోదులో రాజకీయ వత్తిళ్లను లెక్క చేయకుండా ముందుకు వెళుతున్నారు. ఈ క్రమంలో గత నెలలో జరిగిన ఏటీఎంల చోరీలు సవాల్‌గా మారాయి. కడపలో చోరీ జరిగిన ద్వారకానగర్ ఏటీయంకు కూతవేటు దూరంలోనే అటు తాలూకా ఇటు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఉన్నాయి. ఒంటిమిట్టలో కూడా చోరీ జరిగిన ఏటీఎం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే ఉంది. ఈ చోరీలను ఎస్పీ చాలా సీరియస్‌గా తీసుకున్నట్లుగా చెబుతున్నారు. రాత్రిపూట గస్తీ ఇతర వాటిపై పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు..

ఏటీయంల దొంగల కోసం ప్రత్యేకబృందాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే కరుడుగట్టిన నేరగాళ్ల వేలిముద్రలు సేకరించాం. ఏటీయంలే కాదు.. గత నెలలో పులివెందుల, కడప, మైదుకూరులో జరిగిన దొంగతనాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. త్వరలోనే దొంగలను అరెస్టుచేస్తాం.



- హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ

బాధ్యతలు చేపట్టిన డీపీవో రాజేశ్వరి



డీపీవోగా బాధ్యతలు చేపడుతున్న రాజ్యలక్ష్మి

కడప (రూరల్), అక్టోబర్ 4: పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో)గా గండికోట రాజ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏపీఎస్ఐఆర్డీ విజయవాడలో డీపీవోగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చానన్నారు. ఇదివరకు పలు జిల్లాలలో ఇన్‌చార్జ్ డీపీవోగా పనిచేశానన్నారు. తనకున్న అనుభవంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల సద్వినియోగంతో పాటు గ్రామ పంచాయతీలో ఆర్థిక వనరులను పెంపొందించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పాటుపడతామన్నారు. ప్రతి పల్లెలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధిదీపాలు తదితర వాటికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కాగా.. ఈమె బాధ్యతలు చేపట్టడానికి ముందు మర్యాదపూర్వకంగా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిశారు.

డిప్యూటీ సీఈవోగా మైథిలి బాధ్యతలు

జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి (డిప్యూటీ సీఈవో)గా పి.మైథిలి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ శాఖ ద్వారా అమలయ్యే పథకాల లక్ష్యసాధనకు తనవంతు తోడ్పాటు అందిస్తానన్నారు. పంచాయతీశాఖ కడప డివిజనల్ అధికారి (డీఎల్‌పీవో)గా విజయభాస్కర్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ కడప డివిజనల్ అధికారిగా పనిచేస్తున్న వెంకటసుబ్బయను అనంతపురం జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవోగా ప్రభుత్వం నియమించడంతో ఆయన శుక్రవారం రిలీవ్ అయ్యారు. ఈ పోస్టుకు ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు.



డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు చేపడుతున్న మైథిలి

బాధ్యతలు చేపట్టిన కడప ఆర్డీవో

కడప (కలెక్టరేట్), అక్టోబరు 4: కడప రెవెన్యూ డివిజనల్ అధికారిగా జాన్ ఎర్విన్ పాలపర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 2022 గ్రూప్-1 అధికారి. ప్రకాశం జిల్లా కనిగిరి ఆర్డీవోగా విధులు నిర్వహించారు. ఇటీవల కడపకు బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా.. గతంలో కడప ఆర్డీవోగా పనిచేసిన ధర్మచంద్రారెడ్డిపై పలు ఆరోపణల నేపథ్యంలో మూడు నెలల క్రితం ఆయన బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఆర్డీవోగా వెంకటపతి కొనసాగారు. రెగ్యులర్ ఆర్డీవో రావడంతో ఆయన నేషనల్ హైవే డిప్యూటీ కలెక్టర్‌గా తన పూర్వస్థానానికి వెళ్లారు.



బాధ్యతలు తీసుకుంటున్న జాన్ ఎర్విన్ పాలపర్తి

క్షేమంగా వెళ్లి.. విజ్ఞానంతో తిరిగి రండి

- ఏపీ దర్శన్ విజ్ఞాన విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు
- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4: విద్యార్థులు క్షేమంగా వెళ్లి విజ్ఞానంతో తిరిగి రావాలని కలెక్టర్ శివశంకర్ ఆకాంక్షించారు. శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట ఉన్న ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద నుంచి ఏపీ దర్శన్ విజ్ఞాన విహార యాత్రలకు విద్యార్థులు బయలుదేరారు. ఈ బస్సులను కలెక్టర్ శివశంకర్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ దర్శన్ పేరుతో జిల్లా నుంచి ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలకు పంపుతున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహంతో ఈయాత్రకు వినూత్నంగా ఏర్పాట్లు చేశామన్నారు. కడప నుంచి అరకు వరకు విహార యాత్రను రూపొందించామని దీనికోసం 11 లగ్జరీ బస్సులను కేటాయించామని అన్నారు. 7 రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్‌ఎర్విన్, సాయిశ్రీ, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈవో అనురాధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా విజ్ఞాన విహార యాత్రకు బయలుదేరిన 500 మంది విద్యార్థులకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి బిస్కట్లను వితరణగా అందించారు.



విహారయాత్రకు బయలుదేరిన బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

భవానీ నమోస్తుతే..



విజయదుర్గాదేవి ఆలయంలో బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు



కడపలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు

కడప (మారుతీనగర్)/ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 4: జిల్లాలో అన్ని ఆలయాల్లో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండోరోజైన శుక్రవారం అమ్మవారు భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో, పాత మార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో భవానీదేవిగా దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మిదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు. కడపలోని అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.

విజయదుర్గాదేవి ఆలయంలో..

కడప నగరంలోని బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో విశేష పూజలు, చండీహోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ శ్రీ చక్రమండపంలో నవావరణ శ్రీచక్రార్చన తదుపరి యాగశాలలో చండీ హోమ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు విశేష పూజ కైంకర్యాలలో భాగంగా అమ్మవారికి సహస్ర కలువ పూజ కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారిని బ్రహ్మచారిణి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భవానీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

'ఇసుక మేత'గాళ్లపై వేటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- హౌసింగ్ ఏఈ సస్పెన్షన్
- ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్ల తొలగింపు

ప్రొద్దుటూరు, అక్టోబరు4: పేదలకు ఇళ్ల నిర్మాణాల పేర జగనన్న కాలనీ లేఅవుట్లలో జరిగిన ఇసుక స్కాంలో హౌసింగ్ అధికారి, సిబ్బందిపై వేటు పడింది. ప్రొద్దుటూరు అర్బన్ హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశారు. రామేశ్వరం లేఅవుట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమారి, బొల్లవరం లేఅవుట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇందిర, మీనాపురం లేఅవుట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గుర్రప్పలను విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్లు హౌసింగ్ జిల్లా పీడీ రాజారత్నం తెలిపారు. వివరాలిలా..

ప్రొద్దుటూరులోని జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన ఇసుక అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో గత ఏడాది డిసెంబరు 20న 'జగనన్న కాలనీల్లో ఇసుక మేత', ఈ ఏడాది జూలై 4 'జగనన్న ఇళ్ల నిర్మాణాల పేర రూ.2 కోట్ల ఇసుక స్కాం' కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాల ఆధారంగా హౌసింగ్ జిల్లా అధికారులు కొన్ని నెలలుగా విచారణ చేపడుతూ చర్యలు తీసుకోవడంలో కాలయాపన జరిపారు. ముఖ్యంగా ఈ స్కాంలో దాదాపు రూ.2కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. వేలాది టన్నుల ఇసుకను లేఅవుట్‌లకు తోలకుండానే ఆన్‌లైన్‌లో ఇన్‌వాయిస్‌లు అప్‌లోడ్‌చేసి తోలినట్లు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారు. అంతేకాకుండా ఇళ్ల నిర్మాణాలకు తోలిన ఇసుకకు సంబంధించిన కూపన్లను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అప్‌లోడ్ చేయలేదు. దీంతో లేఅవుట్‌లలోకి తోలిన టన్నుల కొద్ది ఇసుక మాయమైంది. ఈ స్కాంపై ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు చేశారు. సీఎంవో ఆదేశాలతో హౌసింగ్ ఎండీ రాజబాబు విజిలెన్సు విచారణకు ఆదేశించారు. దీంతో రెండురోజుల క్రితం అమరావతి నుంచి విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ప్రొద్దుటూరుకు వచ్చి విచారణ చేపట్టారు. రికార్డులు పరిశీలించి అందరితో స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. అయితే విచారణ నివేదిక రాకముందే జిల్లా హౌసింగ్ పీడీ క్రిష్ణయ్య ఈ స్కాం తమకు ఎక్కడ చుట్టుకుంటుందోనని ట్రాన్స్‌ఫర్ మీద వెళుతూ అధికారిని సస్పెండ్ చేయడంతో పాటు కాంట్రాక్ట్ బేస్‌మీద పనిచేస్తున్న ముగ్గురిని విధుల నుంచి తొలగించారు. ఈ విషయాన్ని కొత్తగా చార్జ్ తీసుకున్న హౌసింగ్ పీడీ రాజారత్నం బహిర్గతం చేశారు. ఈ స్కాంలో జిల్లా స్థాయి అధికారుల పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విజిలెన్సు అధికారులు ఈ మొత్తం వ్యవహారంపై నివేదిక ఇస్తే మరింత మందిపై చర్యలు ఉండే అవకాశం ఉంది.

రక్షమాం రాజరాజేశ్వరి..పాహిమాం పరమేశ్వరి



కడప రాజరాజేశ్వరీదేవి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారం



బాపోలేరమ్మ ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా..



హనుమప్ప వీధిలో ధాన్యలక్ష్మీదేవిగా..

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం అంగరంగ వైభవోపేతంగా ఉత్సవాలు జరిగాయి. 'జగజ్జనీ.. లోకపావని.. రక్షమాం తల్లీ' అంటూ భక్తులు శరణు కోరారు. అమ్మవారి దివ్య మంగళ రూపాలను చూస్తూ మురిసిపోయారు. దీప కాంతుల నడుమ ఆలయ దర్శనం కొత్త మధురానుభూతినిచ్చింది. జిల్లాలో పలుచోట్ల అమ్మవారి భారీ సెట్టింగులు వేసి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

- కడప (కల్చరల్)



విజయదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సుమంగళి పూజలో పాల్గొన్న మహిళలు



వివిధ వేషధారణలో మహిళలు



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు



చెన్నూరులో బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు



పులివెందులలో మీనాక్షిదేవిగా దర్శనమిస్తున్న అంకాళమ్మ దేవత



గజలక్ష్మీదేవి అలంకరణలో వేంపల్లె అమ్మవారిశాలలో అమ్మవారు



హరిహరిరావు వీధిలో (నాగరాజుపేట) గజలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



నబీకోటలో రాజరాజేశ్వరీదేవి అలంకారం



వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారం

ఎరువులు, పురుగు మందుల దుకాణాలు తనిఖీ

కడప రూరల్, అక్టోబర్ 4: కడప నగరంలోని జయశంకర్ ఫెర్టిలైజర్స్, రైతుడిపో, వెంకటేశ్వర సీడ్స్ దుఖాణాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల నాణ్యతను పరిశీలించారు. 5 విత్తన శాంపిల్స్‌ను సేకరించి పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ లైసెన్సు కలిగి ఎమ్మార్పీ ధరకే ఎరువులను, విత్తనాలను, పురుగుమందులను విక్రయించాలన్నారు. బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనుమతులు లేని పురుగుమందులు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

కమలాపురం: డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని వల్లూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల ఎరువులు, విత్తనాల పురుగుమందుల డీలర్లుకు సమీక్ష సమావేశం నిర్వహించారు.

పెండ్లిమర్రి: మండలంలోని ఎరువుల, విత్తనాల, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణా అధికారి గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల విలీన సమస్యను పరిష్కరించండి

కడప (మారుతీనగర్), అక్టోబరు 4: ఆర్టీసీ ఉద్యోగుల విలీన సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు శేషగిరిరావు, వైశ్రీనివాసరావు, ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం విజయవాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు పత్రం సమర్పించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సమాచార పన్ను వసూలు కేంద్రం ప్రారంభం

పులివెందుల టౌన్, అక్టోబరు 4:పులివెందుల పురపాలక సంఘంలో మున్సిపల్ కమిషనరు రాముడు ప్రజల పురపాలకసంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సు, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లను మెరుగుసరిచేందుకు గాను సంచార పన్ను వసూలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రజలందరూ ఆ అవకాశాన్ని వినియోగించుకుని పన్నులు చెల్లించి ఆన్‌లైన్‌రశీదులు పొందాలన్నారు.

కొత్త లైసెన్స్‌పై అవగాహన కల్పించండి

పులివెందుల టౌన్, అక్టోబరు 4 : నూతన మద్యంషాపుల లైసెన్సులకుసంబంధించి అవగాహన కల్పించాలని ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనరు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందుల ప్రొహిబిషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అలాగే కొత్త మద్యంషాపులకు సంబంధించి ఈ నెల 11న టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. అందువల్ల ఎటువంటి సంఘటనలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

'స్వర్ణాంధ్ర విహారదర్శిని'కి స్కూల్ టాపర్స్


పులివెందుల రూరల్, అక్టోబరు 4: పులివెందుల డివిజన్‌పరిధిలోని పాఠశాలల్లో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభచూపిన విద్యార్థులు స్వర్ణాంధ్ర విహారదర్శినికి శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా పులివెందుల, లింగాల, సింహాద్రిపురం ఎంఈఓలు బి.రామకృష్ణయ్య, చంద్రశేఖర్, శారదలు మాట్లాడుతూ ఇటీవల జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. ఇందులో పాఠశాల టాపర్‌గా నిలిచిన దాదాపు 500మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం స్వర్ణాంధ్ర విహార దర్శిని కార్యక్రమం చేపపట్టామన్నారు. 11వ తేదీ వరకు శ్రీకాళహస్తి, శ్రీహరికోట, అమరావతి, విజయవాడ, ద్రాక్షారామం, అన్నవరం, సింహాచలం, విశాఖపట్టణం, అరకు సందర్శిస్తారన్నారు. తిరుగు ప్రయాణంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ముఖాముఖి ఉంటుందన్నారు. పులివెందుల డివిజన్ నుంచి దాదాపు 120 మంది విద్యార్థులు రెండు బస్సులలో కడపకు వెళ్లారన్నారు. శుక్రవారం స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలవద్ద ఎంఈఓలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బస్సులను ప్రారంభిస్తున్న ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు

పంచాయతీ వాటర్ స్కీం ఉద్యోగి ఉత్తయ్య మృతి

వేంపల్లె, అక్టోబరు 4: వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో వాటర్ స్కీం ఉద్యోగిగా పనిచేస్తున్న ఆరుసేర్ల ఉత్తయ్య (50) అనారోగ్యంతో మృతిచెందాడు. 25 సంవత్సరాలుగా నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, పంచాయతీ ఉద్యోగులు, స్థానికుల సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



ఉత్తయ్య (ఫైల్)

దేవస్థాన భూమికి పాస్ బుక్కులు మంజూరు చేయాలి

చక్రాయపేట, అక్టోబరు 4: గండి వీరాంజనేయస్వామి దేవస్థానానికి ఖాజీపేట మండలం చిన్నముక్కపల్లెలో 192/3లో 21సెంట్లు భూమి ఉన్నట్లు తెలిసిందని, ఆ భూమిని సర్వే చేయించి గండి దేవస్థానం పేరుపై పట్టాదారు పాసుబుక్కులు మంజూరు చేయాలని దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఖాజీపేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే చేయించి పాసుబుక్కు మంజూరు చేయిస్తామని తెలిపారు.

ఎస్సీ కులగణాంకాలతోనే ఉపకులాలకు సామాజిక న్యాయం

పులివెందుల రూరల్, అక్టోబరు 4: ఎస్సీ కులగణాంకాలతోనే మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు సూర్యనారాయణను శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

యూటీఎఫ్‌లో ఉపాధ్యాయుల చేరిక

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4 : ఇతర ఉపాధ్యాయ సంఘాల్లో జిల్లా, మండల స్థాయి నాయకులుగా కొనసాగుతున్న నేతలు రాజీనామా చేసి శుక్రవారం యూటీఎఫ్‌లో చేరారు. యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు ఆధ్వర్యంలో యూటీఎఫ్‌లో చేరిన వారికి ఆహ్వానం పలికారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీఓ జాన్ ఎర్విన్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 4: కడప రెవెన్యూ డివిజనల్ అధికారిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన జాన్ ఎర్విన్ శుక్రవారం కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను ఆయన చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు.



కడప డీఎస్పీగా వెంకటేశ్వర్లు

కడప (క్రైం), అక్టోబరు 4 :కడప సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా వెంకటేశ్వర్లు రానున్నారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన అనంతపురం, కడప జిల్లాల్లోవిధులు నిర్వహించారు. ప్రస్తుతం సీఐడిలో పనిచేస్తూ కడపకు బదిలీపై వస్తున్నారు. రెండురోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. కడప డీఎస్పీగా పనిచేసిన షరీఫ్‌ను పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.



మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం


చక్రాయపేట, అక్టోబరు 4: మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన వల్లెపు రామాంజనేయులు, దేరంగుల విజయకుమార్‌లో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తుండగా శుక్రవారం ఇరువురిని సిద్దారెడ్డిపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేశామని ఎస్ఐ రంగారావు తెలిపారు. వారి నుంచి 89 మద్యం టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పట్టుబడిన మద్యం, అరెస్టయిన వారితో పోలీసులు

లింగాల ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు

లింగాల, అక్టోబరు 4: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరెడ్డి గాలివీడు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. లింగాలలో ఏఓ లోకేశ్వరరావు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించేవారు.



ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి

కామాంధులను పదవుల నుంచి తొలగించండి

● వైవీయూ ప్రధాన ద్వారం వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4: వైవీయూ ప్రతిష్టను ప్రజాప్రతినిధులు దిగజారుస్తున్నారని, ప్రజాప్రతినిధుల సిఫారసుతో నియమితులైన కామాంధులను ఆయా పదవుల నుంచి తక్షణం తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ ఏరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లాకార్యదర్శి గంగాసురేశ్ ఆధ్వర్యంలో వైవీయూ ప్రధాన గేటు ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన క్రిష్ణారెడ్డిని వీసీగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. మరోవైపు గతంలో లైంగిక వేధింపులకు పాల్పడిన రాంప్రసాద్‌రెడ్డిని రిజిస్ట్రారుగా నియమించడం పనికమాలిన చర్య అన్నారు. తక్షణం వారిని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర, నాయకులు గణేశ్, రాము తదితరులు పాల్గొన్నారు. కాగా.. లైంగిక వేధింపుల ఆరోపణలున్న రిజిస్ట్రారును తొలగించాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జగదీశ్, నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఏఐఎస్‌యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైవీయూ రిజిస్ట్రారును తొలగించాలని లేదంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ప్రతినిధులు

ఎంపీడీఓగా కిరణ్‌మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ

చెన్నూరు, అక్టోబరు 4:చెన్నూరు ఎంపీడీఓగా బి.కిరణ్ మోహన్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్రమణ్యం శర్మ కర్నూలు జిల్లా నందికొట్కూరుకు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో సత్యసాయి జిల్లా తలుపుల మండలంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న కిరణ్‌మోహన్‌రావు బదిలీపై చెన్నూరుకు వచ్చారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.



వల్లూరు మండల డిప్యూటీ తహసీల్దారుగా లక్ష్మమ్మ

వల్లూరు, అక్టోబరు 4: వల్లూరు మండల డిప్యూటీ తహసీల్దారుగా లక్ష్మమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో జీఎస్ఎస్ఎస్ 2లో పనిచేస్తూ వల్లూరుకు డిప్యూటీ తహసీల్దారుగా వచ్చారు. ఈ సందర్భం గా ప్రజలకు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎల్లవేళలా అందుబాటులో ఉం టామని తెలిపారు. అలాగే వల్లూరు మండల ఏపీయంగా యామిని పూర్ణిమ కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

పంచాయతీరాజ్ డీఈగా సుధాకర్‌రెడ్డి

వేంపల్లె, అక్టోబరు 4: వేంపల్లె పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్‌గా సుధాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పులివెందులలో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఈగా పనిచేస్తున్న రవిచంద్రారెడ్డి స్థానంలో సుధాకర్‌రెడ్డిని నియమించారు. డివిజన్ పరిధిలోని మండలాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు.



సీకేదిన్నె ఎంపీడీఓగా కుళాయిబాబు

సీకేదిన్నె, అక్టోబరు 4:చింతకొమ్మదిన్నె నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పీఎం కుళాయిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి ఎన్నికల విధులకు చిత్తూరుజిల్లా నగిరికి బదిలీపై వెళ్లి అక్కడే రిటైర్డు కావడంతో ఈవోఆర్‌డీ శ్రీధర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. చిత్తూరు జిల్లా నాగలాపురం నుండి బదిలీపై వచ్చిన కుళాయిబాబు సీకేదిన్నె ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టి మండల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు.



సర్వధర్మ సమ భావన బీజేపీతోనే సాధ్యం

కడప (మారుతీనగర్), అక్టోబరు 4: సర్వధర్మ సమ భావన భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు బీరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప అక్కాయపల్లెలో బీరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో మన దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా వికసిత్ భారత్- వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ బీజేపీలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. కావున ప్రతి ఒక్కరూ బీ జేపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాయకులు ఓబులేసు మహిళా నాయకురాలు శోభాబాయి పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వంలో పార్టీ నాయకులు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలి

పులివెందుల రూరల్, అక్టోబరు 4: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణపనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం ఆదేశించారు. శుక్రవారం స్థానిక కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో సచివాలయ అమెనిటీ సెక్రటలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మెగా లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఏస్థాయిలో పనులు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇంటిని మంజూరు చేయాలని సూచించారు. అలాగే ఇళ్ల నిర్మాణ పనుల క్యూరింగ్ విషయంలో సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కళల పట్ల అవగాహన కల్పించేందుకే కళా ఉత్సవాలు: జేసీ

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4 : భిన్న సంస్కృతులతో విలసిల్లే భారతదేశంలో ఆయా కళల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించడం వాటిని కాపాడుకోవడం కోసం కళా ఉత్సవాలు దోహదపడతాయని జేసీ అతిధిసింగ్ అన్నారు. శుక్రవారం కడప కేంద్రీయ విద్యాలయంలో రాష్ట్రీయ ఎక్ససర్వ్ కళాఉత్సవ్ 2024 ఘనంగా నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కేంద్ర విద్యాలయ రెండురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముఖేష్‌మీనా పర్యవేక్షించారు.

ఆదర్శప్రాయుడు ప్రభాకర్‌రెడ్డి



ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కడప రూరల్, అక్టోబర్ 4: పంచాయతీ శాఖ జిల్లా అధికారి(డీపీఓ)గా పనిచేసి బదిలీపై వెళ్తున్న ప్రభాకర్‌రెడ్డి ఆదర ప్రాయుడని నూతన డీపీఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న ప్రభాకర్‌రెడ్డికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డీపీఓగా పనిచేయడం తన అదృష్టమన్నారు.

'ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో విచారణ జరిపించండి'

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4 : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ యూనివర్సిటీ, వైవీయూలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ నాయకులు శ్రీనాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఆయా యూనివర్సిటీల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకం చేపట్టారని, దానిపై విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మనోజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

యురేనియం గ్రామాలలోని సమస్యలు పరిష్కరించండి

వేముల, అక్టోబరు 4: యురేనియం ప్రభావిత గ్రామాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి బాధితులను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు జనరల్ మేనేజర్ ఎంఎస్ రావు, ఏజీఎం సుమన్‌సర్కార్‌లను మబ్బుచింతలపల్లె మాజీ సర్పంచు శ్రీనాథ్‌రెడ్డితో కలిసి పార్థసారధిరెడ్డి మాట్లాడారు. పులివెందుల సింగిల్ రహదారిని డబుల్ లేన్ రహదారిగా మార్చాలని, తుమ్మలపల్లె, మబ్బుచింతలపల్లె గ్రామాల మీదుగా ఈ రహదారిని విస్తరిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కొత్త రహదారిని రెండు గ్రామాల మీదుగా కాకుండా బయట నిర్మిస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో అధికారులదే కీలక పాత్ర

కడప రూరల్, అక్టోబర్ 4 : గ్రామపంచాయతీల అభివృద్ధిలో ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీల పాత్ర కీలకమని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ (జడ్పీ సీఈవో) మన్నూరు సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్(డీపీవో) రాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. ఏపీ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, డీఎల్‌డీవోలకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. పూర్వపు డీపీవో ప్రభాకర్‌రెడ్డి, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసాద్, ఏవో బండల్లి నాగభూషణం, ఎంపీడీవోలు, ఈవోపిఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం

● అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప (సెవెన్‌రోడ్స్), అక్టోబరు 4 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రకాశ్ బాబు అన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల (రిమ్స్) ఆవరణంలో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా జిల్లాఅదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు వచ్చారు. వైద్యకళాశాల విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించి అందరినీ అలరించారు. అనంతరం కళాశాల కాన్ఫరెన్స్ హాలులో వైద్యవిద్యార్థులు వైద్య అధ్యాపకులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబును రిమ్స్ అధికారులు అన్ని విభాగాల అధిపతులు ఘనంగా సత్కరించారు. స్పోర్ట్స్‌మీట్‌లో గెలుపొందిన వారికి మెడల్స్‌ను, మెమెంటోలను, అదనపుఎస్పీ చేతుల మీదుగా ఇప్పించారు. ఈ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.వెంకట్రాముడు, జీఎంసీ వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్‌భాస్కరరెడ్డి, విభాగాదిపతులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మండలాభివృద్ధికి సమష్టి కృషి అవసరం

లింగాల, అక్టోబరు 4: మండలాభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని ఎంపీపీ రమాదేవి అన్నారు. శుక్రవారం లింగాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల అధికారులు అభివృద్ధి ప్రణాళికను వివరించారు. కాగా ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టడంపై అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి ఇలా గైర్హాజరుకాకుండా చూడాలని అధికారులను పలువురుకోరారు.



మాట్లాడుతున్న ఏఓ రమేష్

కొండలా పేరుకుపోతున్నాయి..



వసంతపేట మున్సిపల్ కాంప్లెక్స్

- మున్సిపల్ గదుల అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం
- లక్షల్లో పేరుకుపోతున్న బకాయిలు
- నోటీసులకే పరిమితమవుతున్న రెవెన్యూ సిబ్బంది
- కఠినంగా వ్యవహరిస్తే తప్ప వసూళ్లు కాని అద్దెలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 4: మున్సిపాలిటీ అద్దె గదులు ఒక్కసారి లీజుకు తీసుకుంటే చాలు.. ఇక సొంత గదులు లాగే వ్యాపారులు భావిస్తుంటారు. నెలనెల అద్దెలు చెల్లించాలని ఏ మాత్రం భావించరు. మున్సిపల్ సిబ్బంది సైతం అద్దెలు వసూళ్లు చేయాలనే తలంపు వుండదు. దీంతో వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా ఎప్పుడో ఒకప్పుడు కట్టవచ్చనే నిర్లక్ష ధోరణిలో ఉంటున్నారు. దీంతో అద్దె బకాయిలు వసూళ్లుకాక లక్షల్లో పేరుకుపోతున్నాయి. ఇక ఎప్పుడైనా ఒత్తిడి చేస్తే.. అంత చెల్లిస్తాం.. ఇంత చెల్లిస్తాం అంటూ రాజకీయనేతలతో సిఫారస్సులు చేయిస్తూ ముఖం చాటే స్తారు. దీంతో ఏడాదికి మున్సిపల్ అద్దెగదులకు రావాల్సిన డిమాండ్ ప్రకారం వసూళ్ల కాక మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడు తోంది. దీనిపై మున్సిపల్ రెవెన్యూ విభాగపు అధికారులు అద్దె గదుల వసూళ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దె గదుల బకాయిలు ఇలా...

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పలు ప్రాంతాల్లో మున్సిపల్ అద్దె గదులు వున్నాయి. ఓల్డ్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 10, వసంతపేట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 21, స్టేట్ బ్యాంకు వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌లో 20, సిరిపురి కాంప్లెక్స్‌లో 2, వైఎంఆర్‌కాలనీ పార్కు వద్ద 3, గంగమ్మ దేవలం వీధిలో 1, కామిశెట్టి సుబ్బారావు టీబీ కాంప్లెక్స్‌లో 61 మొత్తం కలిపి 119 అద్దె గదులు వున్నాయి. కాగా, మున్సిపల్ అద్దె గదుల బకాయిలు సెప్టెంబరు 19 వరకు వున్న మొత్తం రూ.35.29లక్షలు. ఇందులో ఓల్డ్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పది గదులకు గాను 8 గదులకు సంబంధించి మొత్తం రూ.9,05,160 బకాయి ఉన్నారు. వసంతపేట షాపింగ్ కాంప్లెక్స్‌లో 21 గదులకు గాను 4 గదులకు రూ.2,67,878 బకాయి పడ్డారు. స్టేట్ బ్యాంకు పక్కన గల షాపింగ్ కాంప్లెక్స్‌లో 20 గదులకు గాను 8 గదుల బకాయిలు రూ.1,00,214, పాణ్యం ఎర్రమునిరెడ్డి కాలనీ ఎంట్రెన్స్‌లో వున్న సిరిపురి కాంప్లెక్స్‌లో రెండు పెద్ద గదులు వుండగా అందులో 1 గదికి రూ.9,10,336 బకాయి వుంది. పాణ్యం ఎర్రమునిరెడ్డి సర్కిల్‌లో గల కామిశెట్టి సుబ్బారావు టీబీ కాంప్లెక్స్‌లో మొత్తం 61 గదులు వున్నాయి. ఇందులో 29 గదులకు రూ.13,45,416 బకాయిలు వున్నారు. మొత్తం 119 గదులలో 22 గదులు ఖాళీగా వున్నాయి. ప్రస్తుతం 97 గదులకు మాత్రమే అద్దెలు వసూళ్లు అవుతున్నాయి. 97 గదుల్లో 50 గదులు అద్దె బకాయిలున్నాయి. ఈ తరహాలో మున్సిపల్ అద్దె గదుల వసూళ్లు ఉంటే మున్సిపాలిటీ ఆదాయానికి తీవ్ర నష్టం వాటిల్లుతుండటం తప్ప లాభం లేదని పలువురు చెబుతున్నారు.



కామిశెట్టి సుబ్బారావు మున్సిపల్ కాంప్లెక్స్

ప్రతి వార్డుకో సచివాలయం వున్నా...

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మొత్తం 46 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 46 మంది వార్డు అడ్మిన్‌లు ఉన్నారు. ప్రతి సచివాలయంలో పది మంది వుంటే మొత్తం 500 మంది సచివాలయ సిబ్బంది వున్నా మున్సిపల్ ఇంటిపన్నుల, మున్సిపల్ అద్దె గదుల బకాయిల్లో ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అధికారులకే తెలియాలి. నెలనెల ప్రతి సచివాలయ పరిధిలో అడ్మిన్‌లకు బాధ్యత అప్పగించాలి. వారు అద్దెలు వసూళ్లు చేయకపోతే చర్యలు తీసుకునేలా మున్సిపల్ రెవెన్యూ అధికారి, కమిషనర్ వ్యవహరించాలి. కానీ వందలాది మంది సిబ్బంది వున్నా అద్దెలు, పన్నుల వసూళ్లలో అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతోంది. కాగా మున్సిపాలిటీలో మొత్తం 119 అద్దె గదులు వుంటే.. అందులో 22 ఖాళీగా వుంటే ప్రతి నెల ఎంత ఆదాయం మున్సిపాలిటీ నష్టపోవాల్సి వస్తుందో అధికారులకు తెలిసినా వాటిపై దృష్టి సారించడం లేదని ఆరోపణలున్నాయి.

ఏడాదికి రూ.1.30 కోట్లు ఆదాయం

మున్సిపల్ అద్దె గదుల ద్వారా ప్రతి ఏడాది నెలకు రూ.1.30 కోట్ల మేర ఆదాయం వచ్చేది. నేడు ఆ ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ సెక్షన్ అధికారులు మేల్కొని.. మున్సిపల్ అద్దె గదులకు సక్రమంగా వసూళ్లు చేయడంతో పాటు ఖాళీగా వున్న వాటికి వేలం వేయాల్సి ఉంది.



సిరిపురి మున్సిపల్ కాంప్లెక్స్

అద్దె వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ అద్దె గదులకు సంబంధించి బకాయిల వసూళ్లలో ప్రత్యేక చర్యలు తీసుకుం టాం. వార్డు సచివాలయ సిబ్బందిని టీంలుగా వేసి నెలనెల అద్దెలు వసూళ్లు అయ్యేలా చేస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఖాళీ గదులకు వేలం వేస్తున్నా ముందుకు రావడం లేదు. వెంట వెంటనే గదులకు వేలం వేసి అద్దెలకు ఇస్తాం. మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడే ఏ చర్యలను ఉపేక్షించం.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

302 మంది పంచాయతీ సెక్రటరీల బదిలీలు

కడప రూరల్, అక్టోబర్ 4: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలలోని వివిధ క్యాడర్లకు సంబంధించి 302 మంది పంచాయతీ సెక్రటరీలను శుక్రవారం డీపీవో బదిలీ చేశారు. వీరిలో 48 మంది గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 4 క్యాడర్‌కు చెందిన పంచాయతీ సెక్రటరీలు ఉండగా, 99 మంది గ్రేడ్ 5 క్యాడర్‌కు చెందిన సెక్రటరీలు, 87 మంది గ్రేడ్ 6 క్యాడర్‌కు చెందిన డిజిటల్ అసిస్టెంట్లతో పాటు మరో 68 మందిని రిక్వెస్ట్ ద్వారా బదిలీ చేశారు. వీరితో పాటు 13 మంది ఈవోపీఆర్‌డీలను, ఇద్దరు డీఎల్‌పీవోలను బదిలీ చేశారు. ఈ మేరకు వారికి కేటాయించిన స్థానాలలో శనివారం బాధ్యతలను చేపట్టనున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4 : విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకుని నిష్ణాతులుగా తయారు కావాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ తెలిపారు. శుక్రవారం శిక్షణ పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి జరుగుతున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. నిపుణులైన అధ్యాపకులు అందించే శిక్షణ, జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని.. ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రేమ్‌సమీర్ పాల్గొన్నారు.

ఆదర్శనీయం మీ సేవలు : వీసీ



మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 4: సమాజసేవలో మీ మార్గం అనుసరణీయం, ఆదర్శనీయమని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ 2023-24 విద్యాసంవత్సరానికి యూనివర్శిటీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న మహాకవి గురజాడ మాటలు అందిపుచ్చుకుని దేశ సౌభాగ్యం కోసం పాటుపడాలని సూచించారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు. అనంతరం ఉత్తమ అధికారులకు సత్కారం చేశారు.

ప్రొద్దుటూరులో ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్



ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 4: ప్రొద్దుటూరు గ్రౌండ్‌లో శుక్రవారం ఆర్వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ యజమాని ఆర్వీ రమణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం దాదాపు రెండు దశాబ్దాలుగా 100కు పైగా అనేక దేశీయ, విదేశీయ టూర్లను అందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చక్కటి సౌకర్యాలతో ఎన్నో ప్యాకేజీలు రూపొందించామన్నారు. ప్రముఖంగా కాశీ-అయోధ్య, బ్యాంకాక్ టూర్లను అతి తక్కువ ధరలలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

- జిల్లాలో 1,73,591 రైతులకు రూ.34.72 కోట్లు జమ

రాయచోటిటౌన్, అక్టోబరు 4: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 18వ విడత పీయం కిసాన్ నిధులను శనివారం ఉదయం 11.30 గంటలకు మహారాష్ట్ర నుంచి విడుదల చేయనున్నారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో 1,73,591 రైతులకు గాను రూ.34.72 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ పీయం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమం ప్రతి రైతు సేవా కేంద్రంలోని స్మార్ట్ టీవీలో లైవ్ టెలికాస్ట్ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు, రైతులందరూ ఈ కార్యక్రమాన్ని తమ రైతు సేవా కేంద్రం నుంచి వీక్షించాలని ఆయన తెలియజేశారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి

కొండాపురం, అక్టోబరు 4: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య (77) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు... వెంకటసుబ్బయ్య గురువారం సాయింత్రం తాళ్లప్రొద్దుటూరు-జోగాపురం పాత మట్టిరోడ్డులో వాకింగ్‌కు వెళ్లాడు. అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వారి బంధువులు ఫిర్యాదు చేశారన్నారు. గండికోట బ్యాక్‌వాటర్ పక్కనే మృతదేహం ఉండటంతో మరే ఇతర కారణంతో మృతి చెందడా అని తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్థలం విషయమై ఇరువర్గాల ఘర్షణ

- టీడీపీ కార్యకర్తలకు గాయాలు

మైలవరం, అక్టోబరు 4: మండల పరిధిలోని చిన్నవెంతుర్ల గ్రామంలో శుక్రవారం ఇంటి వద్ద కలందొడ్డి స్థలం విషయమై ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. పోలీసులు, బాధితులు వివరాల మేరకు.. గ్రామంలో గత కొన్నేళ్లుగా వీరి మధ్య స్థలం వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలైన తండ్రి కుమారులు చేరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, వైసీపీ వర్గానికి చెందిన మౌలాలిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో గొడ్డలి, కర్రలతో చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డిలపై దాడికి పాల్పడటంతో రక్తగాయాలయ్యాయి. వెంటనే వారిని జమ్ములమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి డాక్టర్లు ప్రొద్దుటూరుకు రెఫర్ చేశారు. ఘర్షణకు సబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం పోలీసులు తెలిపారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

జమ్మలమడుగు, అక్టోబరు 4: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం గంగమ్మ దేవాలయంలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. అమ్మవారికి అలంకరించిన వెండికిరీటాన్ని చోరీ చేశారు. ఆలయ పూజరుల వివరాల మేరకు... నాలుగు నెలల క్రితం ఓ భక్తుడు అమ్మవారికి ఒకటిన్నర లక్ష విలువచేసే వెండి కిరీటం బహూకరించారు. దసరా పండుగను పురస్కరించుకుని నవరాత్రుల రెండవ రోజు గంగమ్మ అమ్మవారికి శుక్రవారం ఉదయం వెండికిరీటం అలంకరించి పూజలు నిర్వహించామన్నారు. ఇంటికి వెళ్లి మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయం వద్దకు వెళ్లి చూడగా.. గుర్తు తెలియని వ్యక్తులు గేటు తాళం పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి వెండికిరీటాన్ని చోరీ చేశారు. ఈ విషయం స్థానిక అర్బన్ పోలీసులకు తెలపడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు పూజారులు తెలిపారు.

13 దుంగలు స్వాధీనం

రాజంపేట, అక్టోబరు 4: అక్రమంగా తరలిస్తున్న 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సిద్దవటం ఎఫ్ఆర్వో కళావతి తెలిపారు. శుక్రవారం డీఆర్వో కె.ఓబులేశు, సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టగా.. ఎద్దులగుండాల ప్రదేశంలో స్మగర్లు కనిపించడంతో పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోయారన్నారు. అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీలో సిద్దవటం ఎఫ్‌బీవో పెంచల్‌రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కమలాపురం రూరల్, అక్టోబరు 4: మండలంలోని జంగంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన రామసుబ్బయ్య (73) జీవితంపై విరక్తితో గురువారం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రామసుబ్బయ్య కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురయ్యాడు. బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించగా అవయవాలు దెబ్బతిన్నాయని చెప్పగా ఇంటివద్దనే ఉంచారు. దీంతో ఆ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లోనే మద్యంలో పురుగు మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబీకులు కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అవుట్‌పోస్టు పోలీసులు సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాలివాన బీభత్సం

- విరిగిన విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న పంటలు



కొండపేటలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మరు

చెన్నూరు / వేంపల్లి, అక్టోబరు4: చెన్నూరు మండలంలో గురువారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వీచిన గాలులతో కురిసిన వర్షంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోగా వాటిపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడ్డాయి. దీంతో బాగా నష్టం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. గాలివాన వల్ల విమానశ్రయ ప్రాంతంలో మూడు విద్యుత్‌స్తంభాలు విరిగాయని, పలు విద్యుత్‌స్తంభాలు ఒరిగాయన్నారు. అలాగే శాటిలైట్‌సిటీ ప్రాంతంలో సైతం విద్యుత్‌స్తంభాలు విరిగాయి. కొండపేట ఉమామహేశ్వర ఆలయం సమీపంలో 7 విద్యుత్ స్తంభాలు విరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.



అలిరెడ్డిపల్లె వద్ద పూర్తిగా నేలవాలిన వరిపంటను చూపుతున్న రైతు

నేలకొరిగిన వరిపంట

వేంపల్లె మండలంలో గాలివానకు పలుపంటలు దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి ఉన్నట్లుండి వీచిన గాలులు, కురిసిన వర్షానికి వేంపల్లె, అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె, కుమ్మరాంపల్లె వీరన్నగట్టుపల్లె, ఇడుపులపాయ గ్రామాల్లో వరి పంట దెబ్బతింది. కొన్నిచోట్ల పంట మొత్తం నేలవాలింది. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి కొద్దిరోజుల్లో కోతకు వస్తున్న వరి కళ్లముందే దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె ప్రాంతాల్లో సన్ననిమ్మచెట్లు నేలకొరిగాయి. నేలవాలిన వరిపంటను మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ పరిశీలించారు.

బాధ్యతాయుతంగా పనిచేసి మంచి పేరు తేవాలి



బదిలీ అయిన అధికారులతో కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 4: బదిలీ అయిన అధికారులు జిల్లాలో బాధ్య తాయుతంగా పనిచేశారని, అదే స్ఫూర్తితో బదిలీపై వెళ్లే ప్రాంతాల్లో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబరులో కలెక్టర్ అధ్యక్షతన బదిలీ అయిన అధికారులకు ఆత్మీయ అభినందన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీ అయిన అధికారులు తనతో పనిచేసిన కాలంలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచే శారన్నారు. జిల్లా నుంచి బదిలీ అయిన 8 మంది అధికారులు జమ్మల మడుగు ఆర్డీవో శ్రీనివాసులు, పులివెందుల ఆర్డీవో వెంకటేష్, స్పెషల్ కలెక్టర్ కౌసరుభాను, మున్సిపల్ కమిషనరు వైవీ నందన్, జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటసుబ్బయ్యలతో జిల్లాలో పనిచేసిన అనుభవాలు చాలా ఉన్నాయన్నారు. తనకు అన్ని విధాల సహకరించారంటూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తోటి అధికారులతో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. తదనంతరం బదిలీపై వెళుతున్న జిల్లా అధికారులు కలెక్టర్ శివశంకర్‌ను దుశ్శాలువతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర గౌడ్, సీపీవో వెంకట్రావు, అధికారులు సరస్వతి, సురేష్‌కుమార్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వణ్య ప్రాణ వారోత్సవాల పోస్టర్ విడుదల

వణ్యప్రాణి వారోత్సవాల గోడపత్రాలను కలెక్టర్ శివశంకర్, జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డిలు శుక్రవారం ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టర్ చాంబరులో జరిగిన ఈకార్యక్రమంలో అటవీశాఖాధికారులు పాల్గొన్నారు.

వివేకా హత్యకేసులో సునీల్ యాదవ్ బెయిల్‌పై విడుదల

సైదాబాద్,అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందారెడ్డి కేసులో నిందితుడు సునీల్ యాదవ్ శుక్రవారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. గురువారం సునీల్ యాదవ్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. గత రెండేళ్లుగా సునీల్ యాదవ్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు గంగిరెడ్డి, శంకర్ రెడ్డి జైలులో ఉన్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య



సింహాద్రిపురం, అక్టోబరు 4: మండలంలోని గురిజాల గ్రామంలో కడుపు నొప్పి తాళలేక రామశేఖర (46) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గురిజాల గ్రామ సమీపంలో రామశేఖర వేపచెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు కలరు. మృతుని భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ హాజీవలి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

పిడుగుపాటుకు ఆవు, కోడెదూడ మృతి

సింహాద్రిపురం, అక్టోబరు 4: మండలంలోని బి.చెర్లోపల్లెలో శుక్రవారం పిడుగుపాటుతో ఆవు, కోడెదూడ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు అన్నవరం సతీష్‌కుమార్‌రెడ్డి సమాచారం మేరకు.. ఆవు, కోడెదూడలను గడ్డి మేత కోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. అదే సమయంలో వర్షం కురవడంతో ఇంటికి తోలుకుని వస్తుండగా పిడుగుపాటుకు ఆవు, కోడెదూడ మృత్యువాత పడ్డాయని తెలిపాడు. రూ.2లక్షలు విలువ చేసే ఆవు, కోడెదూడ మరణించడంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు సతీష్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు.

అరవీడు పంచాయతీలో ఆవు మృతి

గాలివీడు, అక్టోబరు 4: మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీ శ్రీనగర్ కాలనీలో గురువారం రాత్రి పిడుగు పడటంతో ఆవు మృతి చెందింది. పాడి ఆవును నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని.. ఆవు చనిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు లక్ష్మిదేవి కోరారు.

ఘర్షణలో వ్యక్తి మృతి



కమలాపురం రూరల్, అక్టోబరు 4: మండల పరిధిలోని అప్పారావుపల్లెలో దారి విషయమై జరిగిన ఘర్షణలో రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు సమాచారం మేరకు... అప్పారావుపల్లెకు చెందిన శీలం రామక్రిష్ణరెడ్డి, యల్లారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పొలాల పక్కపక్కనే ఉన్నాయి. వీరి పొలాలకు అదే గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి పొలం ఉంది. శంకర్‌రెడ్డి తన పొలంలోకి వెళ్లేందుకు యల్లారెడ్డి, విశ్వనాథరెడ్డిలు అడ్డగిస్తున్నారు. రామక్రిష్ణారెడ్డి వేరే దారి గుండా వెళ్లాలని పంచాయతీ చేసి దారి ఏర్పాటు చేయడంతో వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అయితే శుక్రవారం మాకు తెలియకుండా శంకర్‌రెడ్డికి దారి ఏర్పాటు చేస్తావా అంటూ ఘర్షణకు దిగారు. రామక్రిష్ణారెడ్డి వారిని వారిస్తుండగా ఒక్కసారిగా తోసారు. దీంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. అయితే రామక్రిష్ణారెడ్డి కొద్దిరోజుల క్రితమే గుండెకు స్టంట్ వేయించుకుని ఉన్నాడు. కింద పడిపోయిన రామక్రిష్ణారెడ్డిని బంధువులు హుటాహుటిన కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరిశీలించి సంతాపం తెలిపారు.

రాయచోటి ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



రాయచోటిటౌన్, అక్టోబరు 4: రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సలో చేసి మహిళ కడుపులో నుంచి 4 కిలోల కణతిని తొలగించారు. రాయచోటి మండల పరిధిలోని యండపల్లి హరిజనవాడకు చెందిన శకరమ్మ తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ రాయచోటి ఏరియా ఆస్పత్రికి వచ్చింది. మహిళను పరీక్షించిన వైద్యులు మహేశ్వర్‌రాజు, అనిల్, వెంకటశివ బృందం మహిళకు ఆపరేషన్ నిర్వహించి ఆమె కడుపు నుంచి నాలుగు కిలోల గడ్డను విజయవంతంగా తొలగించారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యంగా ఉండడంతో మహిళ బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్మాత..నమోస్తుతే...



ప్రొద్దుటూరు చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవి అలంకారం



జమ్మలమడుగులో వాసవీ మాత గాయత్రిదేవిగా...



మైదుకూరుఅమ్మవారిశాలలో గాయత్రీదేవి, ఖాజీపేటలో మోహినీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 4: దేవీ నవరాత్రుల లో భాగంగా శుక్రవారం రెండో రోజు అమ్మవారు భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో భవానీదేవి, పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భవానీదేవి, చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు భక్తులను ఆకట్టుకుంది.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే కన్యతీర్థంలో బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే నాగులకట్ట చౌడేశ్వరీదేవి అమ్మవారు, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, కోవెలకుంట్ల రోడ్డులోని సాయిబాబా ఆలయం, ముద్దనూరు రోడ్డులోని సాయిబాబా ఆలయం, కన్నెలూరు గ్రామంలో చౌడేశ్వరీదేవి అమ్మవారికి తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. ప్రత్యేక అలంకారాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు అమ్మవారిశాలలో శుక్రవారం వాసవి మాత అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీలక్ష్మి మాధవరాయస్వామి దేవాలయంలో కూడా గాయత్రీదేవి అలంకారంలో పార్వతీదేవి భక్తులకు దర్శనమించారు.

కాశినాయన..: నర్సాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా నిర్వహిం చిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొండాపురం..: దేవి నవరాత్రుల్లో భాగంగా మండలంలోని దత్తాపురం పెద్దమ్మగుడిలో శుక్రవారం గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఎర్రగుంట్ల..: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఎర్రగుంట్లలో శుక్రవారం రాత్రి మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో వాస వాంబ శ్రీభవాని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏరు వాకగంగమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారం నిర్వహించారు. చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు శారదాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

నేటి నుంచి ధ్యాన దసరా ఉత్సవాలు..: ఎర్రగుంట్ల మండలంలోని బిస్మిల్లాబాద్ వద్ద శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి పిరమిడ్ ధ్యాన మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముద్దనూరు..: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆయలంలో శరన్నవరాత్రుల మహోత్సవాల్లో అమ్మవారు పార్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖాజీపేట..: కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మోహినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ దరిశా గంగిశెట్టి పర్యవేక్షిస్తున్నారు.

బద్వేలుటౌన్..: దేవీ శరన్నవరాత్రుల్లో శుక్రవారం అమ్మవారిశాలలోదుర్గాదేవి అలంకారంలో, మహాలక్ష్మి దేవాలయంలో ధనలక్ష్మీదేవి, కోదండ రామ స్వామి దేవాలయంలో కూర్మావతారం, దుర్గమ్మ ఆలయంలో జాజిపూల వనంలో కనక దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలు భక్తుల సందడితో కళకళలాడాయి. కాగా స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం వాసవీమాతను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్ కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షుడు కేవీసుబ్బారావు, కనమల్లపూటి ప్రసాద్, నాగభూషణం, పీవీఎస్ ప్రసాద్, చలమయ్య, చంద్రశేఖర్, సురేష్‌బాబు, వెంగల్‌రెడ్డి, శివయ్య స్వామి, ఎం.రాజేష్, రామచంద్రా రెడ్డి, సుబ్బారెడ్డి, సింగరయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గోపవరం..: బద్వేలు - నెల్లూరు ప్రధాన రహదారిలో వెలసిన సిద్ధమ్మతల్లి గాయత్రి దేవి అలంకారంలో దర్శనమించారు.

బ్రహ్మంగారిమఠం..: జగన్మాత శ్రీఈశ్వరిదేవి అమ్మవారి మఠంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిఅలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అమ్మవారిశాలలో స్థానిక అమ్మవారిశాలలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకుశారదాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు.



బీ మఠం అమ్మవారిశాలలో శారదాదేవిగా..



బద్వేలులో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

కొత్త ఆర్డీవో ఆదిమూలపు సాయిశ్రీ

జమ్మలమడుగు, అక్టోబరు 4: జమ్మలమడుగు ఆర్డీవోగా శుక్రవారం ఆదిమూలపు సాయిశ్రీ బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఆర్డీవో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఈమె శ్రీకాకుళం జిల్లా బొబ్బిలి నుంచి బదిలీపై జమ్మలమడుగు ఆర్డీవోగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో శ్రీనివాస్ జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని తెలిపినట్లు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 4: ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన క్యాప్ అకాడమీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఇంటర్న్ ఉద్యోగాలకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికల్లో కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ముఖేష్, అజయ్‌కుమార్, రూప, శ్రీకావ్య, సబిహ, శివకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సునీత, రేణుక, నిఖిత ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి 3 నుంచి రూ.4 లక్షలు వేతనం లభిస్తుందని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్‌రవి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

● రోబోటిక్‌పై బెంగళూరుకు యూనిఫస్ట్ రోబోటిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్‌వోడీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి రైతూ బిల్లులు తీసుకోవాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 4 : ఎరువులు, పత్తి విత్తనాలు కొన్న ప్రతి రైతు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల డివిజనులోని పోరుమామిళ్ల, కలసపాడు, బి.మఠం మండలాల్లో పురుగుమందుల షాపులు, విత్తనాల షాపులను ఆయా మండల వ్యవసాయాధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎవరైనా నిబంధనలు అతి క్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో పోరుమామిళ్ల ఏవో వరహరికుమార్, కలసపాడు ఏవో జాకీర్‌షరీఫ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తుల పరిశీలన

ముద్దనూరు అక్టోబరు4:స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్న మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియను శుక్రవారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. అందులో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం షాపుల టెండర్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు తెలిపారు.జిల్లాలో 139 మద్యం షాపుల నిర్వహనకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ముద్దనూరు స్టేషన్ పరిధిలోని ముద్దనూరు-2, కొండాపురం-2,సింహాద్రిపురం-2, తొండూరు-1 మొత్తం 7 మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తునట్లు తెలిపారు. ఇప్పటి వరకు ముద్దనూరు స్టేషన్ పరిధిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్నారు.అంతకు ముందు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది అంతా యూనిఫాంలో ఉండాలని, ఉదయం 8-30గంటలకు స్టేషన్‌లోఉండాలన్నారు.దరఖాస్తుల ప్రక్రియలో ఎటువంటి జాప్యం ఉండకూడదన్నారు.కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

దసరా ఎగ్జిబిషన్‌తో ప్రజలకు వినోదం



ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు, అక్టోబరు 4 : దసరా ఎగ్జిబిషన్‌తో ప్రొద్దుటూరు ప్రజలకు వినోదం తోపాటు మంచి ఆహ్లాద వాతావరణం అందుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దసరా ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌నాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, కాంట్రాక్టర్ ఆర్‌వీ చలపతి చీమల రాజశేఖర్‌రెడ్డి, రామాపురం గురివిరెడ్డి, జయశంకర్ పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు పురుగుమందుల దుకాణాల తనిఖీ

ప్రొద్దుటూరు , అక్టోబరు 4: ప్రొద్దుటూరులో విత్తనాలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను జిల్లావ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తనిఖీ చేపట్టారు. శుక్రవారం మైదుకూరు రోడ్డులోని విజయ లక్ష్మీఆగ్రో కెమికల్స్, వీరభద్ర ఆగ్రోకెమికల్స్, వెంకటేశ్వర ఆగ్రో కెమికల్స్ లను వారు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రికార్డులు, బిల్లు పుస్తకాలు కొనుగోలు కు సంబంధించి ఇన్‌వా యిస్‌లు పరిశీలించారు. వెంకటేశ్వర ఆగ్రో కెమి కల్స్‌లో రూ. 12190 కు ఎరువులకు పత్రాలు సరిగా లేనందున ఈ దుకాణంలో అమ్మకాలు నిలుపుదల చేయమని ఆదేశా లిచ్చారు. వీరభద్ర కెమికల్స్‌లో రూ.30,800 విలువగల పురుగుల మందుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారాలు తెలిపారు. ఏడీఏలు అనిత, మాధవి ఏవో శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

జమ్మలమడుగు, అక్టోబరు 4: జమ్మలమడుగులోని రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. 6వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైదేహీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ బెంగళూరువారి సహకారంతో డాక్టర్లు హాజరవుతున్నారు.

7న మెగా జాబ్‌మేళా..: జమ్మలమడుగు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో ఈనెల 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు, ఎస్వీ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర అర్హతలు కలిగి 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు హాజరు కావాలని కోరారు.